# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం 27 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 4.00pm


## బస్సుయజమానులుగా డ్వాక్రా మహిళలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ప్రజాస్వరం: మరికొద్ది రోజుల్లో డ్వాక్రా మహిళలు బస్సు యజమానులుగా మారతారు. వాళ్లకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మహిళాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శమని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని మహిళా శక్తి క్యాంటీన్, బస్సు షెల్టర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వడ్డీలేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతామన్నారు. వాళ్లకు రూ.25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో డ్వాక్రా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. మరికొద్ది రోజుల్లో డ్వాక్రా మహిళలు బస్సు యజమానులుగా మారతారన్నారు. వాళ్లకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయిస్తామన్నారు. ఆ వాహనాలను ఆర్టీసీకి అద్దెకు ఇప్పిస్తామని చెప్పారు. మహిళల భాగస్వామ్యంతో ఖమ్మంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. వడ్డీ లేని రుణాల పంపిణీని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి అని భట్టి తెలిపారు.

# పరారీలో రాజ్ పాకాల



### ఏ1గా ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఏ2గా రాజ్ పాకాల

హైదరాబాద్: జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీ కేసులో విచారణ చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపారు. ఏ1గా ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఏ2గా రాజ్ పాకాలను చేర్చామన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించారని చెప్పారు. కర్ణాటక లిక్కర్‌తో పాటు విదేశీ మద్యం కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడు లీటర్ల విదేశీ మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఫామ్‌హౌస్ యజమాని, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ విచారణలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సీఐ వివరించారు.

## ఆత్మనిర్భర్‌తో అద్భుతాలు సృష్టి

- స్కామ్‌లపై అవగాహన తప్పనిసరి
- యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రశంసలు
- 28న 'వరల్డ్ యానిమేషన్ డే' జరుపుకొందాం
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : ఆత్మనిర్భర్‌తో భారత్ ప్రతి రంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. స్వయం సమృద్ధి అనేది కేవలం విధానం మాత్రమే కాదన్నారు. అది మన అభిరుచి అని అన్నారు. కొన్నేళ్ల క్రితం భారత్‌లో ఏదైనా క్లిష్టమైన సాంకేతికత అభివృద్ధి చెందుతుందని చెబితే ఎవరూ నమ్మేవారు కాదన్నారు. అపహాస్యం చేసేవారన్నారు. కానీ, ఇప్పుడు ప్రతి రంగంలోనూ అద్భుతాలను చూసి ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ స్కామ్‌లపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'మన్‌కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో పీఎం ప్రసంగించారు. దీపావళి పండగకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రశంసల జల్లు కురిపించారు. యువత మన సంస్కృతికి అద్దం పట్టే ఒరిజినల్ ఇండియన్ కంటెంట్‌ను రూపొందిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా వీటిని వీక్షిస్తున్నారని అన్నారు. యానిమేషన్ రంగం నేడు ఇతర పరిశ్రమలకు బలం చేకూర్చేదిగా రూపుదిద్దుకుందన్నారు. వర్చువల్ రియాలిటీ టూరిజం నేడు ప్రసిద్ధి చెందుతోందన్నారు.

### 28న 'వరల్డ్ యానిమేషన్ డే'

అక్టోబర్ 28న 'వరల్డ్ యానిమేషన్ డే' జరుపుకోనున్నామన్నారు. భారత్‌ను గ్లోబల్ యానిమేషన్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు సంకల్పించాలి' అని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలపై ఆందోళన వద్దని మోదీ ప్రజలకు సూచించారు. ఇలాంటి సందర్భం ఎదురైతే కాసేపు ఆగి, ఆలోచించి ఆ తర్వాత చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దర్యాప్తు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనిచేస్తున్నాయన్నారు. డిజిటల్ మోసాలకు సంబంధించిన వీడియోను ప్లే చేసిన ఆయన.. ఏ దర్యాప్తు సంస్థలు ఫోన్లు, వీడియో కాల్స్ ద్వారా మిమ్మల్ని సంప్రదించవన్నారు. నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తే 1930 నంబర్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ సాయంతో ఫిర్యాదు చేయాలన్నారు.

## బెస్ట్ బ్యాంక్‌గా ఎస్‌బీఐ

ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యుత్తమ బ్యాంక్‌గా నిలిచింది. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఎస్‌బీఐను బెస్ట్ బ్యాంక్‌గా ఎంపిక చేసింది. వాషింగ్టన్‌లో జరిగిన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు సమావేశంలో భాగంగా 31వ వార్షిక ఉత్తమ బ్యాంక్ అవార్డుల కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అసాధారణ సేవలు అందించి కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకోవడంలో తమ బ్యాంక్ ముందంజలో ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ




అవార్డును అందుకున్నారని బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది.

## ఏడు లీటర్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్, ప్రజాస్వరం: జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ కేసులో విచారణ చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీలత వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించినట్లు తెలిపారు. కర్ణాటక లిక్కర్‌తో పాటు విదేశీ మద్యం కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడు లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. విచారణలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.

### కేటీఆర్‌ను ఇరికించే కుట్ర: బాల్క సుమన్

దీపావళి సందర్భంగా రాజ్ పాకాల బంధువులకు పార్టీ ఇచ్చారని అంతే తప్ప రేవ్ పార్టీ నిర్వహించారనడం సరికాదని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తెలిపారు. బంధువులతో కలిసి వేడుక నిర్వహించుకుంటే రేవ్ పార్టీ అంటూ వార్తలు రాయడం సమంజసం కాదన్నారు. రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి ఇంటికి ఎక్సైజ్, పోలీసులు నేరుగా వచ్చారన్నారు. సీఎం ఆదేశాలతో కేటీఆర్‌పై కుట్రకు ప్రయత్నం జరిగిందన్నారు. పార్టీ జరిగింది ఫాంహౌజ్‌లో కాదు.. ఇంట్లో. రాజ్ పాకాల ఇటీవల గృహప్రవేశం చేశారన్నారు. ఈ సందర్భంగా బంధువులకు పార్టీ ఇచ్చారన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమే ఇదని విమర్శించారు.

## ఆ నిర్మాత అవమానించారు

### బాలీవుడ్ నటి విద్యాబాలన్



ముంబయి: దక్షిణాదికి చెందిన ఒక నిర్మాత తనని అవమానించాడని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయానని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో సవాళ్లు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నానని బాలీవుడ్ నటి తెలిపారు. చక్రం అనే మలయాళ చిత్రంతో నటిగా ఎంట్రీ ఇచ్చానన్నారు. మోహన్‌లాల్ హీరో అని చెప్పారు. కెరీర్ ఆరంభంలోనే స్టార్‌హీరోతో సినిమా చేస్తున్నానని తెలిసి చాలా అవకాశాలు నన్ను వరించాయన్నారు. అనివార్య కారణాల వల్ల షూటింగ్ దశలోనే 'చక్రం' ఆగిపోయిందన్నారు. దాంతో మిగిలిన సినిమాల్లో తనను తొలగించి వేరే హీరోయిన్స్‌ను పెట్టుకున్నారన్నారు. మూడేళ్లపాటు బాధపడ్డానని తెలిపారు. ఏం జరుగుతుందో అర్థం కాక.. కుంగుబాటుకు లోనయ్యానని వివరించారు. ఇంట్లో ప్రతిరోజూ గొడవలు జరుగుతుండేవని తెలిపారు. తన తోటి వాళ్లందరూ సెటిలయ్యారు తాను ఇక్కడే ఆగిపోయావని, సినిమాలు సెట్ కావని అమ్మ చెబుతుండేదని అన్నారు. కొంత కాలానికి ఒక తమిళ చిత్రంలో అవకాశం వచ్చిందని చెప్పారు. కొన్నిరోజులు షూట్ చేశా. 'చక్రం' ఆగిపోయిందని తమిళ నిర్మాతకు తెలిసింది. దాంతో ఆయన నా జాతకం చూపించాడు. తమ చిత్రానికి సెట్ కానని తొలగించాడన్నారు. విషయం తెలిసి.. నా తల్లిదండ్రులతో ఆయన్ని కలిశా. సినిమా కోసం షూట్ చేసిన కొన్ని సన్నివేశాలు చూపిస్తూ.. 'ఒక్కసారి ఆమె ముఖం చూడండి హీరోయిన్‌లా ఎక్కడైనా కనిపిస్తుందా? డ్యాన్స్ రాదు. యాక్టింగ్ రాదు' అని అవమానించాడు. దాదాపు ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయా. నాపై నాకే అసహ్యం వేసింది'' అని విద్యాబాలన్ చెప్పారు.

# ఐదు కారిడార్లు .. 76.4 కిలోమీటర్లు

### మెట్రో రెండో దశ డీపీఆర్ కు క్యాబినెట్ ఆమోదం

### రూ. 24,269 కోట్ల అంచనాలతో విస్తరణ

హైదరాబాద్, ప్రజాస్వరం: మెట్రో రైల్ రెండవ దశ ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. రూ. 24,269 కోట్ల అంచనాలతో మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం రాగానే మెట్రో రెండో దశ పనులు మొదలు పెడుతుంది. రాబోయే నాలుగు ఏళ్లలో పూర్తి చేయాలని టార్గెట్‌గా ప్రభుత్వం పెట్టుకుంది. మెట్రో రైల్ హైదరాబాద్ మొదటి దశలో మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లలో సేవలందిస్తోంది. మొదటి దశ ప్రాజెక్టు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానంతో రూ. 22,000 కోట్లతో పూర్తి అయింది. ప్రస్తుతం మెట్రోలో రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ మెట్రో రైల్ అందుబాటులోకి వస్తే సిటీలో రోజుకు మరో 8 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉంది.

### 2వ స్థానం నుంచి 9వ స్థానానికి ..

మెట్రో రైల్ మొదటి దశ అమలుతో దేశంలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉండగా.. ఢిల్లీ మొదటి స్థానంలో ఉంది. ఏడేళ్లు మెట్రో విస్తరణను గత ప్రభుత్వం పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. రెండు, మూడో దశ నిర్మాణాలు కూడా దేశంలోని ఇతర నగరాలు పూర్తి చేశాయన్నారు. దీంతో మెట్రో సేవల్లో హైదరాబాద్ 2వ స్థానం నుంచి 9వ స్థానానికి పడిపోయింది. హైదరాబాదును ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కలకత్తా, పూణే, నాగపూర్, అహ్మదాబాద్ నగరాలు అధిగమించాయి. కాగా మెట్రో విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన రేవంత్ రెడ్డి సర్కార్. మెట్రోను విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. రెండవ దశలో అయిదు కారిడార్లలో 76.4 కిలో మీటర్ల మేర మెట్రో విస్తరణకు డీపీఆర్ సిద్ధం చేసింది.



దీంతో మెట్రో రెండో దశ డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.